
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అధ్వానదారులు..!

ప్రయాణం సాగేదెలా?

- అధ్వానస్థితిలో ఆర్అండ్బీ, పీఆర్ రోడ్లు
- 'మొంథా'తో మరింత దెబ్బతిన్న వైనం
- అరకొర నిధులతో మరమ్మతులు ఎలా?
- గతుకుల రోడ్లపై ప్రయాణికులకు అవస్థలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

రహదారులు సంస్కృతికి మూలాలు.. రోడ్ల ద్వారానే మన సంస్కృతి వ్యాప్తి చెందుతోంది. అలాంటి రహదారులే ప్రస్తుతం అధ్వానంగా మారాయి. గతుకులు, గుంతల మయమైన రోడ్లతో నిత్యం ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. జిల్లాలోని ఆర్అండ్బీ రోడ్లు, పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని గ్రామీణ రహదారులు ఎక్కడ చూసిన ఎక్కువ శాతం దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్‌తో ఆయా రోడ్లు పరిస్థితి దారుణం. సదరు రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారింది.



మహానంది మండలం బుక్కాపురం- అబ్బీపురం రహదారి

నంద్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులన్నీ గుంతల మయం అయ్యాయి. బ్రిడ్జిలు సైతం ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో రాకపోకలు సైతం నిలిచిపోయాయి. పాడైనా రోడ్లకు ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడంతో అధికార యంత్రాంగం సైతం అరకొర మరమ్మతులు చేసి మమ అనిపించేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొందరు అధికారులైతే ఆశించిన స్థాయిలో నిధులు రాక.. తలలు పట్టుకునే పరిస్థితి. జిల్లాలో తలెత్తిన గుంతల రోడ్లు.. గతుకుల రోడ్లతో ప్రయాణం అంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



చాగలమర్రి మండలం గోట్లూరు-నేలంపాడు రోడ్డు ఇలా...

వైసీపీ పాలనలో..

వైసీపీ పాలనలో రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. ఎక్కడిక్కడ రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. కూటమి రాకతో పల్లె పండుగ.. తదితర రూపాల్లో అటు ఆర్అండ్బీ, ఇటు పీఆర్ పరంగా కొంత వరకు రోడ్లు వేశారు. ఆశించిన స్థాయిలో ఎక్కడా వేయలేదు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో చాలా వరకు రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఆర్అండ్ బీ పరంగా బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల.. పంచాయతీ రాజ్‌శాఖ పరంగా శ్రీశైలం, నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజక వర్గాల్లో ఎక్కువగా రోడ్లు దెబ్బతిన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి.

జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇలా...

- ఆర్అండ్బీ రోడ్లు : 1512 కి.మీ
- 'మొంథా'తో దెబ్బతిన్న రోడ్లు : 640 కి.మీ
- తాత్కాలిక మరమ్మతుల కోసం మంజూరైన నిధులు : రూ. 3.20 కోట్లు
- 150 కి.మీ రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపినవి : రూ.5 కోట్లు

దెబ్బతిన్న పంచాయతీరాజ్ శాఖ రోడ్లు : 101.448 కి.మీ

- మరమ్మతులకు పంపిన ప్రతిపాదనలు : రూ.4.788 కోట్లు
- 'మొంథా'తో దెబ్బతిన్న రోడ్లు : 32.85 కి.మీ
- దెబ్బతిన్న బ్రిడ్జిలు, కల్వర్టులు : 12
- తాత్కాలిక మరమ్మతుల కోసం.. : రూ. 26.91 లక్షలు
- శాశ్వత మరమ్మతుల కోసం ప్రతిపాదనలు: రూ.21.05 కోట్లు

అత్యవసరమైన ప్రాంతాల్లో తాత్కాలిక..



జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న ఆర్అండ్బీరోడ్లను గుర్తించాం. అత్యవసరమైన ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకున్నాం. విడతల వారిగా వచ్చే నిధులతో జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి తదితర పనులు వేగవంతంగా చేస్తాం.

● ఏవీ శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్అండ్బీ, నంద్యాల

ఆశించిన స్థాయిలో నిధులు..

జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు సైతం పనులు చేయ కుండా మొండికేశారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ఆయా రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. అధికార లెక్కలు కంటే.. తుఫాన్‌తో రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఎక్కువగానే దెబ్బతిన్నట్లు సమాచారం. అధికారులు నామమాత్రంగానే నివేదిక తయారు చేశారనే ఆవర్గాల్లో చర్చ సాగింది.

గగనంగా మారింది

అరకొర నిధులతో రోడ్లు బాగు చేయడం గగనంగా మారింది. అధికారులు కూడా ఏమీ చేయలేని దుస్థితి. చేసిన పనులకు బిల్లులు రాక.. సదరు కాంట్రాక్టర్లు పనులు చే యాలంటే జంకుతున్నారు. చివరికి చేసేదీ లేక.. కొందరు అధికారులు తమ పరిధిలోని కాంట్రాక్టర్లకు నచ్చచెప్పి మరీ పనులు చేయించాల్సిన దుస్థితి ఏర్పడింది. మరికొన్ని ప్రాంతాల్లో అధికారులు తాత్కాలిక మరమ్మతులు సైతం అర కొరగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మొంథా తుఫాన్‌తో పాటు ఎక్కువగా దెబ్బతిన్న రోడ్లకు ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు చేసి సుర క్షిత ప్రయాణం దిశగా రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న చాగలమర్రి- చిన్నవంగలి రోడ్డు



ఆళ్లగడ్డ - ఆహోబిలం ఆర్అండ్బీ రోడ్డులో ఏర్పడిన గుంతలు

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలో దెబ్బతిన్న రోడ్లపై తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల కోసం తగిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. పల్లెపండుగలో చాలా వరకు గ్రామీణ రహదారుల పనులు చేశాం. మొంథా తుఫాన్‌తో రోడ్లు దెబ్బతిన్న మాట వాస్తవమే. కొన్నిచోట్ల ఉన్న నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నాం.

● నాగరాజు, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ, నంద్యాల



గుంతలమయంగా దొర్నిపాడు- ఉయ్యాలవాడ రోడ్డు

ఈఎంఐలు స్వాహా

- సుమారుగా రూ.20లక్షలు కాజేసిన ఉద్యోగులు
- కొటక్ మహేంద్ర బ్యాంకు ఎదుట రైతుల నిరసన
- పరారీలో మార్కెటింగ్ సిబ్బంది
- లబోదిబోమంటున్న బాధితులు



బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు చెల్లించిన కంతులు(ఈఎంఐ)లు బ్యాంకులో కట్టకుండా గోల్‌మాల్ చేసింది మార్కెటింగ్ సిబ్బంది. శుక్రవారం సంబంధించి రైతులు ఆ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ పక్కనే ఉన్న కొటాక్ మహేంద్ర బ్యాంకు ఉంది. ఇటీవలే కొంత మంది రైతులు ఈ బ్యాంకులో ఫైనాన్స్ మీద ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. రైతులు ఆరు నెలలకు ఒక్క కంతు సుమారుగా రూ75 వేల నుంచి రూ.లక్ష వరకు చేసుకుని మొదటి నెల కట్టారు. రెండో నెల మొత్తాన్ని సుమారుగా 2 మంది రైతుల దగ్గర నుంచి ఉదయ్ కుమార్, అస్లాం, అనిల్ అనే బ్యాంకు మార్కెటింగ్ విభాగానికి చెందిన ఉద్యోగులు వారి వ్యక్తిగత ఖాతాకు వేయిం చుకుని బ్యాంకులో కట్టకుండా తిరుగుతున్నారు. ఇటీవల బాధిత రైతులందరికి హెడ్ ఆఫీసు నుంచి మీరు లోన్ అమౌంటు కట్టలేదని కట్టాలని చెప్పారు. దీంతో ఏమి చేయాలో తెలియక రైతులు శుక్రవారం బ్యాంకుకు వచ్చి విచారణ చేయగా అక్కడ వారు లేరు. మాడబ్బులు వెనక్కి ఇవ్వాలని రైతులు అడగగా మాకు సంబంధం లేదని చెప్పడంతో బాధితులందరూ బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులు అప్పులు చేసి మరి కంతులు చెల్లిస్తే ఇలా చేయడంతో లబోదిబోమంటున్నారు. వన్‌టౌన్ పోలీసులను సంప్రందించగా వారు మాకు ఏం తెలియదు మీరు వెళ్లి బ్యాంకు వారితోనే మాట్లాడుకోండి అని అంటున్నారని బాధితులు తెలిపారు.

అధికారులు న్యాయం చేయాలి



రెండు నెలల నుంచి కంతులు కట్టలేదని పై నుంచి ఫోన్ వస్తుంది. బ్యాంకు కు వచ్చి అడగగా మాకు తెలియదు అంటున్నారు. సుమారుగా రూ.2లక్షల వరకు ఫోన్‌పే చేయించుకుని కట్టకుండా వెళ్లిపోయారు. అధికారులు మాకు న్యాయం చేయాలి.

● సుధాకర్‌రెడ్డి, బాధిత రైతు, పెద్దకొట్టాల

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను మంత్రి బీసీ తన క్యాంపు కార్యాలయంలో స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు, బాధితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. వినతులు స్వీకరించిన మంత్రి అప్పటికప్పుడే కొన్నింటిపై అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పవద్దని అధికారులను కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు సేవలందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జడ్పీ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

- మెనూలో గుడ్లు ఇవ్వకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం
- హెచ్ఎంకు, ఎంఈవోకు షోకాజ్ నోటీసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం నందమూరి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా మెనూలో గుడ్లు ఇవ్వలేదని విద్యార్థులు చెప్పడంతో వంటశాలను పరిశీలించారు. అక్కడ పరిస్థితులు సరిగా లేకపోవడంతో హెడ్‌మాస్టర్‌కు, ఎంఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అక్కడ పరిస్థితులను చక్కదిద్దాలని డీఈవోను ఆదేశించారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో ఎక్కువగా హార్టికల్చర్, లైవ్‌స్టాక్, అగ్రికల్చర్, ఆక్వారంగానికి జీడీపీ ఎక్కువగా వస్తుందన్నారు. జిల్లాలో 65వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి ఉందని, దానిని 80 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలన్నా ఆలోచనతో జిల్లా యంత్రాగం ముందుకు వెళ్తుందన్నారు. రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల పెంపకం పెంచితే మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి పెరుగుతుందన్నారు. మత్స్యకారుల కోరిక మేరకు జిల్లాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. 50 ఏళ్లు పూర్తైన మత్స్యకారులందరికీ పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన మంత్రి

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల శివారు ప్రాంతం అయ్యలూరు వద్ద ఉన్న టిడ్కో గృహాలను రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టిందన్నారు. కానీ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కేవలం కక్షసాధింపుతో టిడ్కో గృహాలను ఎవరికీ కేటాయించలేదన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చాక పేదలందరికీ టిడ్కో గృహాలను అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఎంఈ గురప్ప తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు



పార్కు పరులపాలు..!

- వ్యాపార కేంద్రంగా కర్నూలు చిన్న పార్క్
- లీజుకు ఇచ్చిన నగరపాలక సంస్థ
- అడ్డగోలుగా గ్లో గార్డెన్‌లో దుకాణాల ఏర్పాటు
- గోడలు కూల్చి హోటల్ నిర్మాణం
- నిర్వాహకుల ఇష్టారాజ్యం
- అధికారుల తీరుపై సర్వత్రా అనుమానాలు

కర్నూలులో చిన్నపార్క్ ఒక ముఖ్యమైన కూడలి. ప్రజా జీవితంలో భాగం. దాన్ని అధికారులు టెండర్లు వేసి లీజుకు ఇచ్చారు. ప్రభుత్వమే వ్యాపారం చేయాలనుకున్నాక.. లీజుకు తీసుకున్న వాళ్లు వెనక్కి తగ్గుతారా? చిన్నపార్క్ ఇప్పుడొక వ్యాపార కేంద్రం. దాని రూపురేఖలే మారిపోయాయి. సొమ్ము సంపాదించుకోవడానికి చేయగల మార్పులన్నీ చేశారు. రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిన నగరపాలక సంస్థ నెలకు రూ. 64 వేలకు 2029 దాకా లీజుకు ఇచ్చి డబ్బు సంపాదించాలని అనుకుంది. లీజుకు తీసుకున్నవాళ్లు పార్క్‌ను ఇష్టానుసారంగా మార్చేసి అంతకంటే భారీ ఎత్తున వ్యాపారం చేస్తున్నారు.

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్న పార్కును సుమారు రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేశారు. అయితే దానిని గ్లో గార్డెన్ పేరుతో టెండరు ద్వారా నెలకు రూ.64 వేల అద్దెతో పాటు 18 శాతం జీఎస్టీ చొప్పున ఇతరులకు లీజుకు ఇచ్చారు. 01.02.2024 నుంచి 31.01.2029 వరకు 5 సంవత్సరాలు ఆర్. ప్రశాంతి టెండర్‌లో దక్కించుకున్నారు. దీంతో పాటు రూ.1,30,00,000కు డిపాజిట్ కూడా చేయించుకున్నారు. అంతే కాకుండా ఐదు సంవత్సరాల వరకు లీజు వర్తించే విధంగా అనుమతులు ఇచ్చారు. నగర పాలక నిబంధనల ప్రకారం లీజుకు తీసుకున్న వారు పార్కులో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అయితే లీజుకు దక్కించుకున్న నిర్వాహకులు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పార్కులో అనేక నూతన కార్యక్రమాలు చేపట్టారు. ఇదంతా నగర పాలక కార్యాలయం కూతవేటు దూరంలో ఉన్నా అధికారులకు తెలియదని చెబుతున్నారు. దీంతో పార్కు అంతా సర్వనాశనమైంది. పచ్చదనం కరువైంది...పర్యవేక్షణ లేదు...పార్కులో సుమారు రూ.25 లక్షల చొప్పున చైనా నుంచి తీసుకువచ్చిన 3 లైటింగ్ చెట్లను తొలగించి దుకాణాలను ఏర్పాటు చేశారు. పార్కులో ఉన్న శిలాఫలకాన్ని తొలగించడంతో పాటు సుమారు రూ.8 లక్షలతో నిర్మించిన వాటర్ ఫౌంటెన్‌ను పూర్తిగా నిర్మూలించారు.

రూ.75 లక్షలు నష్టం...

చిన్న పార్కులో అభివృద్ధి కోసం చైనా నుంచి ఒక్కో చెట్టు సుమారు రూ.25 లక్షల చొప్పున 10 లైటింగ్ చెట్లను తెప్పించారు. వాటిని చైనా నుంచి నౌకద్వారా విశాఖపట్టణం హార్బర్‌కు అక్కడి నుంచి వాహనాల ద్వారా కర్నూలుకు రప్పించారు. అయితే నగర పాలక అధికారుల అనుమతి లేకుండా పార్కులో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సుమారు 3 లైటింగ్ చెట్లను తొలగించారు. వాటి విలువ రూ.75 లక్షలు ఉం టుంది. ఇలా తీసివేడం వల్ల పార్కులో ఆహ్లాదం కరువైంది. దీంతో పా టు దుకాణాలు ఏర్పాటు చేసిన చోట్ల నాలుగు పెద్ద పెద్ద చెట్లును తొలగించారు. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన సుమారు రూ.50 వేలు విలువ చేసే మొక్కలను తొలగించేశారు.

గోడను కూల్చేసి అక్రమంగా హోటల్ నిర్మాణం



పార్కు లోపల హోటల్ నిర్వహణ

చిన్నపార్కులో రెవెన్యూ విభాగం బహిరంగ వేలం నిర్వహించి రూ.1.24,35,000 లీజుకు ప్రైవేటు వ్యక్తికి అప్పగించింది. అయితే మూడు నెలల క్రితం దాని ప్రహరీని కూల్చేశారు. దర్గాగా షాపులు, టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సదరు వ్యక్తులు మున్సిపల్ అధికారులకు మామూళ్లు ఇచ్చుకుని అనధికారికంగా వీటిని ఏర్పాటు చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అధికారులు అనుమతి లేకుండా, టెండర్ లేకుండా మున్సిపల్ ఆస్తులకు సంబంధించిన ప్రహరీని కూల్చడం నేరం. ఎవరికీ చెప్పకుండా కూల్చేయడం, దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకోవడం మున్సిపల్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులకు పట్టలేదు. ఇదే అంశంపై ఆగస్టు 2న జరిగిన నగర పాలక సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు షేక్ అహ్మద్, జుబేర్, మున్సిపల్ అధికారుల అవినీతిపై ధ్వజమెత్తారు.

నిర్వాహకుల ఇష్టారాజ్యం... అడ్డగోలుగా వసూలు

లీజుకు దక్కించుకున్న నిర్వాహకులు ఇష్టారాజ్యంగా పార్కులో పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా పార్కు లోపలికి వెళ్లడానికి నగర పాలక అధికారుల నిబంధనల మేరకు రుసుము చెల్లించనవసరం లేదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు ఎంట్రీ ఫీజు రూ.10 వసూలు చేస్తున్నారు. పార్క్‌లో నగర పాలక ఏర్పాటు చేసిన ర్యాకెట్, ఉయ్యాల నుంచి ఎంట్రీ ఫీజు రూ.30 వసూలు చేస్తున్నారు. నగర పాలక సంస్థకు చెల్లించే అద్దెకన్నా నిర్వాహకులు వసూలు చేసేది ఎక్కువగా ఉంది. పోనీ పార్కునైనా అందంగా ఉంచారా? అంటే అదీ లేదు. పార్క్ అంతా మొక్కలు, రాళ్లు, చెత్తకుప్పలతో నిండిపోయింది. పార్కులో ఏర్పాటు చేసిన కొన్ని విగ్రహాలు తుప్పుపట్టే దిశకు వచ్చినా కూడ అధికారులు పట్టించుకోవడం లేదు.

మిగతా 6వ పేజీలో

ఆయేషా.. ఆదర్శం..

హిజ్రాలంటేనే అదోరకంగా చూసే ప్రస్తుత సమాజంలో ఆయేషా ఆదర్శప్రాయంగా నిలిచింది. పాణ్యం గ్రామానికి 14ఏళ్ల క్రితం వచ్చిన షేక్ అబ్దుల్ మజీద్ ఉరఫ్ ఆయేషా సొంత గ్రామం పాములపాడు మండలం భానుముక్కల. ఈమె తల్లిదండ్రులు షేక్ ఫాతిమాబీ, షేక్ మౌలాలి. వీరికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. అబ్దుల్ మజీద్(ఆయేషా) నాల్గవ సంతానం. ఐదవ తరగతి వరకు చదువుకున్న ఆయేషా మగ పిల్లవాడిగా పుట్టి పొలం పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడు, వాదోడుగా ఉండేవాడు. హార్మోన్స్ లోపం కారణంగా ఆడపిల్ల లక్షణాలు వచ్చాయి. ఆయేషా ఆడపిల్లలతో కలిసి తిరగడంతో తల్లిదండ్రులు అవమానంగా భావిస్తుండడంతో 14 యేళ్ల క్రితం పాణ్యంకు వచ్చి హిజ్రాల బృందంలో చేరింది.

-పాణ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):


వరి సాగులో కలుపు తీస్తున్న ఆయేషా

- భిక్షాటన వదిలి కౌలు రైతుగా మారి
- బాలుడి నుంచి ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఆయేషా
- పంటలతో పాటు పాడి, పశు అభివృద్ధిలో కృషి

పేరు మార్చుకొని హిజ్రాగా మారి...

పాణ్యంకు వచ్చిన షేక్ అబ్దుల్ మజీద్ హిజ్రాగా మారి ఆయేషాగా పేరు మార్చుకొని భిక్షాటనతో జీవనాన్ని గడుపుతుండేవాడు. కొన్నేళ్ల తర్వాత భిక్షాటన వదలి కౌలు రైతుగా మారింది. ఎకరా రూ. 25వేలు చెల్లిస్తూ రెండెకరాలలో వరి సాగు చేస్తోంది. మహానంది మండలం గంగవరంలో ఎకరా కౌలు తీసుకొని మొక్కజొన్న పంటను సాగు చేస్తుంది. పంటల సాగుతోపాటు పాడి అభివృద్ధికి కృషి చేస్తోంది. రెండు బర్రెలు, ఆరు ఆవులు పెంచుతోంది. వీటి పశుగ్రాసం కోసం 25 సెంట్ల స్థలంలో కోత్రి గడ్డిని (పారం గడ్డి) పెంచి పశువులకు అందిస్తుంది. అటు పాడి, ఇటు పంటలను పండిస్తూ గ్రామంలో రైతుగా నిలదొక్కుకుంది. సాగుబడిలో పంటకు పెట్టుబడులు, మందులు, కోతలు, అమ్మకాలు ఒక్కతే చేసుకోవడం గర్వించదగ్గ విషయం.

ఎకరాకు 40 బస్తాలు : ఎకరాకు 40 బస్తాల వరి దిగుబడి సాధిస్తున్నట్లు ఆయేషా పేర్కొంది. ఒక్కోసారి దొంగలు పడి తమ పంటను రాత్రివేళల్లో కోసుకువెళ్లడం, పందులదాడులతో నష్టపోతుంటానని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బ తినే పరిస్థితి ఏర్పడినట్లు పేర్కొంది.


పశువులను సంరక్షిస్తున్న ఆయేషా

ఆమె మాటలే జీవితాన్ని మార్చివేశాయి : ఆయేషా



తొమ్మిదేళ్ల క్రితం పాణ్యం రహదారిపై భిక్షాటన చేస్తూ ఓ కారును ఆపి డబ్బులు అడిగాను. కారులో ఒకావిడ నన్ను పిలిచి నీవు తల్లిగర్భంలో నుంచి మగ పిల్లవాడిగా పుట్టావు, నీ తల్లిదండ్రులు నీకు కండలు, రక్తాన్ని పంచారు. దేవుడు జన్మనిచ్చాడు. హార్మోన్ల లోపంతో మారిన నీవు జీవించడానికి నీకు ఏమి లోపమని అడుక్కుంటున్నావని, మీరు బలవంతంగా తీసుకునే డబ్బు ప్రయాణికులు ఏ అవసరంలో వెళ్తున్నారో ఆలోచిస్తున్నారా అని ప్రశ్నించిందని పేర్కొంది. వారిని ఆపి డబ్బు డిమాండ్ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించిన మాటలు నా మనసును తీవ్రంగా చలింపజేశాయి. భిక్షాటన వదలి పొలం కూలీపనులకు వెళ్లేదాని. వ్యవసాయ పనుల్లో మంచి నైపుణ్యం లభించడంతో పాటు పంటల సాగుకు ధైర్యం లభించింది. అనాథలకు, మాలాధారులకు తన వంతు సహకారమందిస్తూ సామాజిక సేవలో ఉడతాభక్తితో సేవలందిస్తోంది. ఆయేషా ఒక హిజ్రాగా కాకుండా కౌలు రైతుగా మారి సాగిస్తున్న జీవన స్థితిగతులను మిగిలిన హిజ్రాలు గమనించాలని భిక్షాటనే ధ్యేయంగా జీవించే హిజ్రాలు ఆయేషాను ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్నాతకోత్సవం విజయవంతం

సమన్వయంతో పని చేసిన ఉద్యోగులకు అభినందనలు

- ఉపకులపతి వి. వెంకట బసవరావు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ 4వ స్నాతకోత్సవం సమన్వయంతోనే విజయవంతం చేయగలిగామని ఉపకులపతి వి. వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో బోధన, బోధనేతర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈనెల 12న వర్సిటీలోని కాన్వకేషన్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక వల్ల ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పని చేయడంతో కార్యక్రమం విజయవంతమైందని ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయ కుమార్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్ సుందరానందపుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్, పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8 మంది విద్యార్థులు డీబార్

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షలో 8 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో 9,463 మంది పరీక్షల కోసం దరఖాస్తు చేయగా 8,611 మంది పరీక్షలు రాశారని తెలిపారు. పరీక్షలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులను డిబార్ చేశామని తెలిపారు.

ఆన్‌లైన్ భద్రతపై జాగ్రత్త వహించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి


ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో బాలలు ఆన్‌లైన్‌లో దోపిడీకి గురి కాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి కోరారు. చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో శుక్రవారం న్యాయ సేవా సదన్ భవనంలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ పిల్లల ఆన్‌లైన్ భద్రతా విధానాలు, సైబర్ క్రైమ్స్‌ను అడ్డుకోవడంపై సంబంధిత అధికారులు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ వేదికలో పిల్లలు అనేక రకాలుగా దోపిడీలకు గురవుతున్నారన్నారు. వాటిని ఎదుర్కొని పిల్లలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సైబర్ క్రైం సీఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పలు మోసాలు జరుగుతున్నాయనీ, ఈ మోసాలలో పిల్లలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బెంగుళూరు చెందిన సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ శుభత్ కుమార్ పిల్లలపై ఆన్‌లైన్‌లో జరిగే దోపిడీలు, వాటిని ఎదుర్కొనే విధానాల గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, కర్నూలు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సీడీపీవోలు, డీసీపీవోలు, సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా బేగం, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, దిశా పీఎస్ సీఐ రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి 'మీ కోసం రైతన్న'


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న మీకోసం రైతన్న కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ సాంకేతికతల వినియోగం వంటి కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రైతులను ప్రత్యక్షంగా కలిసి రోజుకు 30మంది రైతులకు పథకాలను వివరించి రైతుల ఫొటోలను యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈనెల 24 వ తేదీ నుంచి 29 వరకు కొనసాగి అనంతరం రైతుల సమస్యలను సేకరించి డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు.

దేవుడి సొమ్ము సొంతానికి

- కోటి దీపోత్సవ విరాళాలు సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఉద్యోగి
- 15 ఏళ్ళుగా నిర్వాకం

మహానంది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయన దేవదాయశాఖలో ఓ ఉద్యోగి. దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి. కానీ ఈయన ఒక ముఠాను తయారు చేసుకొని దాతల నుంచి వచ్చే ఆర్థిక వనరులను స్వాహా చేస్తున్నాడు. ఇది ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి వెళ్ళినట్లు సమాచారం.

అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఒక భక్తుడు మహానందీశ్వరస్వామి వారికి కార్తీక పౌర్ణమి రోజు నిర్వహించే కోటి దీపోత్సవానికి, జ్వాలా తోరణానికి అవసరమైన 20 లీటర్ల నూనెకు అవసరమైన డబ్బును 15 సంవత్సరాలుగా అందిస్తున్నారు. ఆలయానికి చెందిన ఓ ఉద్యోగి ఎవ్వరికి తెలియకుండా దాత ఇస్తున్న విరాళాన్ని సొంత ఖాతాలోకి మళ్లించుకుంటున్నాడు. ఈ వ్యవహార 15 సంవత్సరాలుగా జరుగుతున్నది. ఇటీవల క్షేత్రంలో జరిగిన కోటి దీపోత్సవం సందర్భంగా వెలుగులోకి వచ్చింది. క్షేత్రానికి వచ్చే దాతలు ఈయన మాటలు నమ్మి ఇస్తున్న మిగతా విరాళాలు కూడా దారి మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగితో పాటు మహానంది



దేవస్థానంలో ప్రస్తుతం విధులు నిర్వహించే మరో ఉద్యోగి పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం.

విచారించి చర్యలు తీసుకుంటాం

మహానంది క్షేత్రంలో కోటి దీపోత్సవం నిర్వహణ పేరుతో దాత నుంచి ఓ ఉద్యోగి కొన్ని సంవత్సరాలుగా వసూళ్లకు పాల్పడ్డటట్లు తెలుస్తోంది. ఇది రుజువైతే శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. సహ ఉద్యోగుల పాత్ర ఉందనే అంశంపై కూడా విచారిస్తున్నాం. -శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో

పార్కు పరులపాలు!

(5వ పేజీ తరువాయి)

గ్లో గార్డెన్‌ను అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అధికారులు ఇతర ప్రాంతాల నుంచి రకరకాల పక్షుల బొమ్మలను లైటింగ్‌తో ఏర్పాటు చేశారు. అందులో కొన్ని శిథిలావస్థకు చేరాయి. పార్కులో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్‌ను పూర్తిగా తొలగించారు. కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని ఈ పని చేశారు. ఆ స్థానంలో మరో దుకాణం ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. పార్కులో చిరు వ్యాపారుల దుకాణాలను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ప్రారంభించడం చర్చనీయాంశమైంది.



నోటీసు జారీ చేసిన స్పందన కరువు...

ఆగస్టులో కౌన్సిల్‌లో జరిగిన చర్చకు నగర పాలక అధికారులు గత నెల 10న పార్క్ నిర్వాహకురాలు ప్రశాంతికి నోటీసులు జారీ చేశారు. ఇందులో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టారని...గ్లో గార్డెన్ నాణ్యతను దెబ్బతీయడంతో పాటు పార్కు గోడను కూల్చి అదనంగా మరో గేటు ఏ విధంగా ఏర్పాటు చేస్తారని నోటీసులో పేర్కొన్నారు. దీని మీద మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో లీజు రద్దు చేయడంతో పాటు సంబంధిత నిర్వాహకురాలిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. అయితే అదే నెల 16న నిర్వాహకురాలు వివరణ ఇస్తూ నగర పాలక కార్యాలయానికి పంపింది. అందులో ఓ ప్రజాప్రతినిధి అనుమతితోనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నామని... కమిషనర్ ఆదేశాల మేరకు గోడను కూల్చి అదనంగా గేటు ఏర్పాటు చేసుకున్నామని వివరణ ఇచ్చారు. లీజు పూర్తి అయిన వెంటనే పార్కులో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు తాను సిద్ధమని ఈ వివరణ వచ్చి నెల రోజులు అవుతున్నా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నోటీసు జారీ చేశాం తగిన చర్యలు తీసుకుంటాం



గ్లో గార్డెన్ లీజుకు తీసుకున్న నిర్వాహకురాలికి నోటీసు జారీ చేశాం. ఆమె ఇచ్చిన వివరణ మాకు సమ్మతంగా లేకుంటే తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. పార్కులో నగర పాలక సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరికరాలు..చెట్లు.. ధ్వంసం చేసినట్లు విచారణలో వెల్లడైతే...ఆమెతోనే ఆ పనులు తిరిగి పూర్తి చేయించేందుకు సిద్ధంగా ఉన్నాం. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు.

- పి.విశ్వనాథ్, నగర పాలక కమిషనర్

కమిషనర్ అనుమతితోనే గోడ కూల్చివేత

నగర పాలక కమిషనర్ అనుమతితోనే పార్కు గోడను కూల్చాము. ఓ ప్రజాప్రతినిధి అనుమతితోనే దుకాణాలను ఏర్పాటు చేశాము. లీజు పీరియడ్ అయిన వెంటనే దుకాణాలను తొలగిస్తామని నగర పాలక అధికారులకు ఓ అఫిడవిట్ దాఖలు చేశాను. ప్రజాప్రతినిధి, అధికారులు ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. కేవలం నోటి మాటగా చెప్పారు.

- ఆర్.ప్రశాంతి, గ్లో గార్డెన్ నిర్వాహకురాలు


ఇప్పుడు గోడ పక్కనే దుకాణాల ఏర్పాటు

పత్తి కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఎమ్మిగనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నూరల్ కమర్ పరిశీలించారు. ఆయా జిన్నింగ్ ఫ్యాక్టరీల దగ్గర పత్తి విక్రయించేందుకు వచ్చిన రైతులు ప్రస్తుతం పత్తి కొంత మేరే కొనుగోలు చేస్తున్నారని.. ఎక్కువ క్వింటాళ్లు కొనుగోలు చేయాలని కోరారు. అలాగే స్లాట్ బుకింగ్ సమస్యగా ఉందని, దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన జేసీ సీసీఐ అధికారులతో మాట్లాడారు. వారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెండు మూడు రోజుల్లో రెండోకోత, మూడో కోత పత్తిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, తహసీల్దార్ శేషఫణి, ఏఓ శివశంకర్, జిన్నింగ్ ఫ్యాక్టరీ నిర్వాహకులు మురారి రెడ్డి, మహాభలేశ్వర్, నటరాజ్, సిబ్బంది ఉన్నారు.


జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న జేసీ

పత్తి ఓబులయ్య సేవలు అనిర్వచనీయం

'కమల కళానికేతన్' వ్యవస్థాపక అధ్యక్షుడు ఈరన్న


కళారత్న పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న కవి సవ్వప్పగారి ఈరన్న

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కళారంగానికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత, కళారత్న పత్తి ఓబులయ్య అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని కమల కళానికేతన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి సవ్వప్పగారి ఈరన్న అన్నారు. శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్యకు పూలదండవేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించి, వాటిని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు కృషి చేశారని ప్రశంసించారు. ఈఏడాదిలో వరుసగా మూడు పర్యాయాలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కళాక్షేత్రం పేరు చేర్చడంతో పాటు, కళాకారులందరికీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాలు అందించేలా శ్రమించారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు కేవీ రమణ, డాక్టర్ కదిరి రమేష్, ముద్రిక భాస్కర్, రామ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు


బాబాకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని నెహ్రూనగర్‌లోగల సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈనెల 23న సత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదినం సందర్భంగా మందిరాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం ఆరో రోజు సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో, ఉదయం నిత్య పూజల అనంతరం నగర శివారు దూపాడులోని గో సంరక్షణశాలలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గోశాలలో సామూహిక సత్యసాయి భజనలు, వెయ్యి గోవులకు ఆహారం పెట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం మందిరంలో సత్యసాయికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సత్యసాయి సేవా కమిటి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, యువజన విభాగం జిల్లా సమన్వయ కర్త సందీప్, జిల్లా మహిళా యువజన విభాగం సమన్వయకర్త గీత, ఇతర ప్రతినిధులు మాలతి, రామ్‌మోహన్, సూర్యనారాయణ, సాయిబాబా, డాక్టర్ పార్వతి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలు కల్యాణికి 'జాతీయ అవార్డు'


ఉపాధ్యాయురాలు కల్యాణికి జాతీయ అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

పత్తికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కల్యాణికి మరో గౌరవ అవార్డు వరించింది. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు జాతీయస్థాయి ఉత్తమ అవార్డు అందజేశారు. శుక్రవారం కడప జిల్లా గండికోటలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ తాల్లూరి ప్రసన్న కుమారి చేతుల మీదుగా కల్యాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేఎం తండా గ్రామంలో మూతపడి ఉన్న పాఠశాలను 55 మంది విద్యార్థుల స్థాయికి తీసుకురావడంలో టీచర్ కల్యాణమ్మ చేసిన కృషి అభినందనీయమన్నారు. అంతేకాకుండా అత్యాధునిక భోజనాలతో చిన్నారులను నవోదయ, గురుకులాలకు ఉత్తీర్ణత సాధించడంలో ఆమెచేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమించినా

నిరాశే..!

- పనులు చేసినా అందని బిల్లులు
- మోదీ సభ కోసం అహర్నిశలు కష్టపడ్డ కాంట్రాక్టర్లు
- ఎస్టిమేషన్లు పంపడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 16న కర్నూలులో ప్రధాని మోదీ సభను విజయవంతం చేసేందుకు శ్రమించిన కాంట్రాక్టర్లకు నిరాశే మిగిలింది. అక్టోబరు 6న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలందుకున్న కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరుకు చెందిన కాంట్రాక్టర్లు 7వ తేదీ నుంచి నిద్రాహారాలు లేకుండా లేబర్‌ను సమీకరించుకుని నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేశారు. ప్రధాని సభ కావడంతో 12 పార్కింగ్ స్థలాల్లో కాంట్రాక్టర్లు పోల్స్, విద్యుత్‌లైన్లు, విద్యుదీకరణ పనులు చేశారు. కాంట్రాక్టర్ ద్వారా వెయ్యికి పైగా విద్యుత్ స్తంభాలు, 17 జనరేటర్లు, అలాగే 31 కిలోమీటర్ల కండక్టర్, అలాగే 24-160 కేవీ, 4-315 కేవీ, 4-100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, 41కిలోమీటర్ల కేబుల్‌తో పాటు సంబంధిత ఐరన్ మెటీరియల్ స్టోర్స్ నుంచి అధికారులు డ్రా చేశామని తెలిపారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్వాన్సు కూడా ఇవ్వలేదని జేసీబీలు, లేబర్‌కు ఇవ్వాల్సిన బిల్లులు ఆలస్యం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదని నిరాశతో బిల్లులు కోసం ఎదురు చూపులు తప్పడం లేదంటున్నారు.

ఎస్టిమేషన్ వేయడంలో నిర్లక్ష్యం


ప్రధాని సభకు విద్యుత్ శాఖ తరపున చేసిన పనులకు ఎస్టిమేషన్లు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడంలో కర్నూలు డివిజన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. 12 పార్కింగ్ ఏరియాల్లో పనులు చేసేందుకు 12 మంది అధికారుల ద్వారా కాంట్రాక్టర్లతో పని చేయించారని వాటిని స్కెచ్ రూపంలో డివిజన్ అధికారులకు అప్పుడే అందించారని వివరించారు. పర్సంటేజీల కోసమే అధికారులు అక్టోబరు 24వ తేదీ వరకు ఎస్టిమేషన్లు డిస్కంకు పంపలేదని విమర్శించారు. అది కాకుండా సభ పూర్తైన అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు మెటీరియల్ నుంచి డిస్మ్యాండిల్ (తొలగించి) చేసి స్టోర్స్ తరలించాలి. అక్రమంలో 30శాతం మెటీరియల్ పాడైపోయిందని ఎస్టిమేషన్ అధికారులు పంపి నట్లు తెలిసింది. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ వారం రోజుల్లో 30శాతం విద్యుత్ మెటీరియల్ ఎలా పాడవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఎస్టిమేషన్ మార్చేలా వెనక్కి పంపినట్లు విశ్వసనీయ సమాచారం. నవంబరు నెల పూర్తవుతున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎస్టిమేషన్లు సీఎండీకి పంపాం

బిల్లుల మంజూరు అంశంపై కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ శేషాద్రి, రూరల్స్ ఏడీఈ సుబ్బన్నను సంప్రదించగా ప్రధాని సభ పనుల బిల్లులు ఎస్టిమేషన్స్ తయారు చేసి అక్టోబరు 22న సీఎండీ అనుమతి కోసం పంపామని వివరించారు. పీఎం సభకు డ్రా చేసిన మెటీరియల్ అంతా రిటన్ చేశామని స్పష్టంచేశారు. 12 పార్కింగ్ ఏరియాల్లో పనిచేసిన వర్క్ ఆర్డర్స్ ఎస్టిమేషన్ రూ.1.76 కోట్ల బిల్లు మంజూరు కోసం పంపామన్నారు. సీఎండీ ఎస్టిమేషన్ డెవల్యూషన్ చెక్ కోసం రిజాయిండర్ పంపగా అభ్యంతరాలు పరిశీలించి మరలా ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో బిల్లులు మంజూరవుతా యన్నారు. మెటీరియల్ డిస్‌మాండిల్ చేసే క్రమంలో 1 లేదా 2 పర్సెంట్ పాడ యినట్లు ఏడీఈ తెలిపారు. మోదీ సభకు ఉపయోగించిన 16జనరేటర్లకు అడ్వాన్స్ కింద రూ.14.90 లక్షలు చెల్లించినట్లు ఆయన సూచించారు.

కొంత మెటీరియల్ రిటర్న్ చేయాల్సి ఉంది

జిల్లా స్టోర్స్ సెంటర్ నుంచి అధికారులు డ్రా చేసుకున్న విద్యుత్ సామగ్రి కొంత రిటర్న్ చేయాల్సి ఉందని స్టోర్స్ ఏడీఈ గురుదివాకర్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై స్టోర్స్ ఏడీఈని సంప్రదించగా కన్‌డక్టర్-31 కిమీ డ్రా చేయగా, 11 కిమీ వెనక్కి ఇచ్చారని, ట్రాన్స్‌ఫార్మర్లు 160 కేవీ -24 డ్రాచేసి 20 మాత్రమే రిటన్ చేశారని 4 ట్రాన్స్‌ఫార్మర్లు పెండింగ్ ఉన్నాయన్నారు. 315 కేవీ-4, 100 కేవీ-4 తీసుకుని వాటిని రిటన్ చేశారన్నారు. కేబుల్ 41కిలోమీటరు డ్రా చేసుకుని ఐరన్ మెటీరియల్ కొన్ని ఇవ్వాల్సి ఉందన్నారు.



కర్నూలు టౌన్ డివిజన్ కార్యాలయం బోర్డు

మొదట అలా...తర్వాత ఇలా

కర్నూలు రూరల్స్ ఏడీఈ సుబ్బన్న మొదట మోదీ సభకు తీసుకున్న మెటీరియల్ అంతా రిటన్ చేశామని తెలిపారు. స్టోర్స్ ఏడీఈతో సమాచారం తీసుకున్న తర్వాత నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు రాగమయూరి వెంచర్‌లో రెగ్యులరైజ్ చేయాల్సి ఉందని, అవి పెండింగ్ ఉన్నాయని తెలుపడం గమనార్హం. నవంబరు 5న వాటికోసం ఎస్టిమేషన్ తయారుచేసి ఎస్ఈ అనుమతి కోసం ఫైల్ పం పామన్నారు. ఎస్టిమేషన్ మంజూరు కాగానే అక్కడ 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెగ్యులరైజ్ చేసి, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు స్టోర్స్‌లో అందజేస్తామని ఓర్వకల్లు ఏఈ సునీల్‌కుమార్ తెలిపారు.

రిజిస్ట్రార్‌ను తొలగించాలి

- అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆర్‌యూ విద్యార్థుల నిరసన


ఆర్‌యూలో అర్ధనగ్న ప్రదర్శనతో విద్యార్థుల నిరసన

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాలల అవినీతి, అక్రమాలకు వత్తాసు పలుకుతున్న ఆర్‌యూ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా, మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలలు అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారాయని అన్నారు. రిజిస్ట్రార్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, బీఈడీ కళాశాలల దందాకు అండదండలు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలీ, భూపాల్, బాలాజీ, మునీంద్ర, మధు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

పాణ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం స్టీల్ ప్లాంట్ వద్ద శుక్రవారం రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గంజాయి తీసికెళుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఈ మేరకు సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు వద్ద గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో చాగలమర్రికి చెందిన ముల్లువసీం అక్రం, చాగలమర్రి గడ్డం వీధికి చెందిన లంకా అలెగ్జాండర్, బనగానపల్లె ఈద్గా నగర్‌కు చెందిన బూరుగుల మనోహర్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, పీఎస్ఐ ధనుంజయ, పాణ్యం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

కొలిమిగుండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని నాయునిపల్లె రహదారిలో అక్కదేవత గుడి వద్దకు వచ్చిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. వివరాలు.. అవుకు గ్రామానికి చెందిన దంపతులు తమ 15, 17 ఏళ్ల ఇద్దరు కూతుళ్లతో కలిసి పూజల నిమిత్తం అక్కదేవతల గుడి వద్దకు వచ్చారు. గురువారం రాత్రికి బయటికి వెళ్లివస్తామని చెప్పిన బాలికలు తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా కనిపించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోవెలకుంట్లకు చెందిన బాలిక..

కోవెలకుంట్ల : మైనరు బాలిక అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మైనరు బాలిక పదో తరగతి చదువుతుంది. ఆమె ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తుం డడంతో తల్లిదండ్రులు మందలించగా మనస్తాపానికి గురై గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు వద్ద ఆచూకీ వెతికినా సమాచారం లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఎంపీ అధ్యక్షతన దిశ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంటు కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ సిరి, రాష్ట్ర, జిల్లాస్థాయి దిశా కమిటీ సభ్యులు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భగా ఎంపీ, దిశా చైర్మన్ మాట్లాడుతూ దేవ నకొండ, ఆస్పరి, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ మండలాలు కూరగాయల మీద ఆధార పడిన మండలాలు అని, సంబంధిత ప్రాంతాల్లో రూరల్ హాట్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం పథకాల అమలుకు సంబంధించి ఎంపీ నిర్దేశించిన విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రసూతి మరణాలు జరగకూడదు

జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా ప్రతి గర్భిణీకి సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిరి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రసూతి మరణాలకు సం బంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు 8, 9 నెలల్లో ప్రతి వారం వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో డా.భాస్కర్ రాజు, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

చిన్నారులను చేరదీసిన పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు విడిచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారులను సమాచారం తెలిసిన వెంటనే రైల్వే పోలీసులు వారి ఆచూకీ కనుగొని సురక్షితంగా చేరదీశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు బాలురు ఆకాష్, ప్రశాంత్ బెంగళూరు, కర్ణాటక రాష్ట్రంలోని బిలాల్ మస్జీద్ రోడ్డు గుల్షన్ ఫంక్షన్ హాలు పక్కన, బొమ్మనహల్లి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న కర్నూలు రైల్వే పోలీసులు సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్రమత్తమయ్యారు. కానిస్టేబుల్ విజయ కుమార్ అన్ని రైల్వేస్టేషన్లలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఆ ఇద్దరు బాలురు నంద్యాలలో ఉన్నట్లు మహిళా ఎస్ఐ కుమారి, కానిస్టేబుల్ నరేంద్రలు గుర్తించారు. ఆ ఇద్దరు బాలురును సురక్షితంగా చేరదీసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

తలనీలాల టెండర్ నిలుపుదల

శ్రీశైలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం క్షేత్రంలో యాత్రికులు మొక్కులుగా సమర్పించుకునే తలనీలాల స్వాధీనపర్చుకునే టెండర్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో తలనీలాలను స్వాధీనపర్చుకునేందుకు సంవత్సరానికి సుమారు రూ.5కోట్లు వెచ్చించి టెండరు దక్కించుకున్నారు. ప్రస్తుతం జరగనున్న రెండేళ్లకాలం టెండరు ప్రక్రియను అమలు పరిచేందుకు ఈవో అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ టెండరు విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి త్వరలో పాలకమండలి ఆమోదంతో రీటెండర్‌ను నిర్వహిస్తారన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

రుద్రవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవాగుపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలిపై కోతులు శుక్రవారం దాడి చేశాయి. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఇంటి ఆవరణంలో చెరవ (పాత్ర) తీసుకుని వెళ్తుండగా అందులో తినే పదార్థం ఉందని కోతులు దాడి చేశాయి. గాయపడ్డ వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

నిరసన ప్రదర్శనలో వక్తల డిమాండ్


నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న విరసం బాధ్యుడు పాణి

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ ప్రదర్శనలో వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాల పాలన నిరంకుశంగా ఉందని, రాజ్యాంగం హక్కులను అడుగడుగునా ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా నాయకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులు, మావోయిస్టుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఆపరేషన్ కగార్ పేరిట సొంత ప్రజల పైనే యుద్ధం చేస్తున్నాయని విమర్శించారు. . ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లాడుతూ దేశంలో ఫాసిస్ట్ పాలకులు తమకు ఎన్నికల్లో విరాళాలు ఇచ్చి గెలిపించే అదాని కోసం ఆపరేషన్ కగార్ నడుపుతూ ఆదివాసులను, వారికి అండగా ఉన్న విప్లవకారులను హత్య చేస్తున్నారని అన్నారు. విప్లవ రచయిత సంఘం బాధ్యుడు పాణి మాట్లాడుతూ ఈదేశ మూలవాసులు నేలను, విలువైన వనరులను, ప్రకృతిని కాపాడుకోవడానికి భారత సైన్యంతోనే యుద్ధం చేస్తూ ఉన్నారని అన్నారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైనా మావోయిస్టు నాయకుడు హిడ్మా తమ నేల కోసం బిర్సాముండా, గోండు రాంజీ, అల్లూరి సీతారామరాజు ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించారని అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో ఏఐటీయూసీ నాయకులు మునెప్ప, జగన్నాథం, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, కళాబృందం నాయకుడు పోతన్న, దళిత హక్కుల సంఘం నాయకుడు మహేష్, యువజన సమాఖ్య నాయకుడు శ్రీనివాస్, ఎస్‌డీపీఐ నాయకుడు చాంద్‌బాషా, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ రత్నం ఏసేపు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించండి : డీఈఓ శామ్యూల్‌పాల్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని జోహరాపురంలో 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-17 బాలబాలికలు) కబడ్డీ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి 18వ వార్డు కౌన్సిలర్ పద్మలతరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలు కావాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కర్నూలు జిల్లాలో కబడ్డీ క్రీడకు మంచి గుర్తింపు ఉందన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం స్కూల్‌గేమ్స్ స్పోర్ట్స్ ఫ్లాగ్ ఆవిష్కరించారు. 13 జిల్లాల క్రీడాకారులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కర్నూలు, నెల్లూరు జట్ల కబడ్డీ మ్యాచ్‌ను డీఈఓ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ నిర్వహక కార్యదర్శి టి.కృష్ణ, కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ తిమోజీ, కరస్పాండెంట్ సోలేమాన్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పాణ్యం గోపి జోహరాపురం వెంకటేశ్వర్లు, కోచ్ ఆనంద్, పోటీల పర్యవేక్షకులు బి.ప్రవీణ్ (నెల్లూరు) టి.లక్ష్మి కుమారి (అనంతపురం), న్యాయవాది రామశేషన్న, శేషిరెడ్డి, పుల్లన్న, కర్త, హరిప్రసాద్, పాణ్యం కరుణాకర్ రెడ్డి, తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- ఆరుగురికి తీవ్ర గాయాలు



జూపాడుబంగ్లా/మిడుతూరు/గడివేముల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు మండలాల్లో రోడ్డు ప్రమాదాల్లో జరగ్గా ముగ్గురు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం మొక్కజొన్న లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో శుక్రవారం ఒకరు మృతిచెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. తూడిచర్ల గ్రామం నుంచి నందికొట్కూరు సమీపంలో ఉన్న రబ్బానీ గోదాముకు మొక్కజొన్న లారీ తీసుకెళుతుండగా తంగడంచ సమీపంలో బోల్తాపడింది. లారీలో మొక్కజొన్న సంచులపై ఉన్న తూడిచర్ల గ్రామానికి చెందిన హమాలీలు ఏడుగురిలో భరత్(32) వ్యక్తిపై సంచులు పడటంతో అక్కడిక్కడే మృతిచెందారు. రహదారిపై వెళుతున్న వాహనదారులు, తంగడంచ గ్రామస్థులు కలిసి సంచులు తీసేలోపు భరత్ మృతిచెందగా మిగతా ఆరుగురిని కాపాడారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాల రాకపోకలు గంట వరకు స్తంభించిపోయాయి. గాయపడిన హమాలీలు వెంకటేశ్వర్లు, యుగంధర్, రహమ్మత్‌బాషా, శంకర్, శివరాముడు, పుల్లయ్యను చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడినుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిడుతూరు: మండలంలోని తలముడిపి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాలివీ.. వెంకటేశ్వర్లు నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగరంలో తన తల్లి రమణమ్మతో పాటు నివాసం ఉంటూ గౌండ పనికి వెళ్లేవాడు. శుక్రవారం మహానందికి వెళ్లి వస్తానని తన తల్లితో చెప్పి బైక్‌పై తెల్లవారు జామున బయలు దేరాడు. వెంటేశ్వర్లును తలముడిపి గ్రామ సమీపంలోని కుందూ వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కకి అక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడివేముల: మండలంలోని కొరపొలూరు గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వెలుగోడు మండలంలోని రేగడగూడురు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (50) తన ద్విచక్ర వాహనంలో గడివేముల నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో కల్వర్టు వద్ద ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం అదుపుతప్పి కల్వర్టులో పడిపోగా శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

ఈ-తాండ్రపాడు పీహెచ్‌సీలో విచారణ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం ఈ-తాండ్రపాడు పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈవో మక్బుల్ సాహెబ్‌పై మెడికల్ ఆఫీసర్, కొందరు సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి విచారణ చేపట్టారు. ఎంపీహెచ్‌ఈవో మక్బుల్ సాహెబ్ నిర్లక్ష్యంగా, అసభ్యకరంగా మాట్లాడడని, ఈ-తాండ్రపాడు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.మంజూషా, కొందరు వైద్యసిబ్బంది, డీఎంహెచ్‌వో భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎంహెచ్‌వో విచారణ అధికారిణిగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతిని నియమించారు. ఈమేరకు శుక్రవారం పీహెచ్‌సీలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆమె విచారణ జరిపారు. మెడికల్ ఆఫీసర్, వైద్యసిబ్బంది రాతపూర్వకంగా జరిగిన విషయాన్ని రాసి ఇచ్చినట్లు తెలిసింది. మెడికల్ ఆఫీసర్ డా.మంజూషా జిల్లా లోకల్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో ఈ నెల 18వ తేదీన కమిటీ చైర్‌పర్సన్ డా.మాధవి శ్యామల, ఐసీడీఎస్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. దీనిపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.ఎల్.బాస్కర్‌ను వివరణ అడుగగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈ.తాండ్రపాడులో విచారణ చేపట్టారని, విచారణ నివేదిక రావాల్సి ఉందని తెలిపారు.

పొగాకు తోరణాలకు నిప్పు

- అన్నదాతకు సుమారు రూ.3 లక్షలు నష్టం

నందికొట్కూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దుండగులు పొగాకు తోరణాలకు నిప్పంటించగా నాలుగున్నర ఎకరాల పొగాకు కాలి బూడిదయింది. మండలంలోని కొణిదేల గ్రామంలో ఈ ఘటన జరిగింది. వివరాలివీ.. కొణిదేల గ్రామానికి చెందిన రైతు మహేశ్ 15 ఎకరాల పొగాకు పంటను సాగు చేశారు. పంట పండించి కొణిదేల గ్రామం ఊరిబయట ముచ్చుమర్రి వైపు వెళ్తే రహదారి పక్కన పొగాకును తోరణాలు కట్టి ఆరబెట్టాడు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు వాటికి నిప్పంటించారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నించగా తోరణాలు అగ్నికి ఆహుతి అయిపోయాయి. రైతు మహేష్ మాట్లాడుతూ తాను గ్రామంలో 15 ఎకరాల దాకా ఐటీసీ కంపెనీ వారితో అగ్రిమెంట్ చేసుకుని సాగు చేశానని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన పంట కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలకు తుఫానులకు పొగాకు పంట బాగా దెబ్బతిని పసుపు రంగుకు మారిపోయి భారీగా నష్టం వాట్లిల్లిందని తెలిపారు. ఈ నష్టం నుంచి కోలుకోకముందే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. నందికొట్కూరు ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

భ్రామరికి ఊయల సేవ


ఊయలసేవలో పూజలందుకుంటున్న స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం గ్రామదేవత అంకాలమ్మవారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గణపతిపూజ చేశారు. ప్రాకార మండపంలో ప్రత్యేక పూలతో అలంకరించిన ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆసీనులజేసి పూజలు చేశారు.

ముగిసిన భజనలు

శ్రీశైలంలో కార్తీక మాసాంతం నిరంతరాయంగా చేసిన అఖండ శివపంచాక్షరీనామ చతుస్సప్తాహ భజనలు ముగిశాయి. శుక్రవారం ఉదయం నందిమండపంలో ప్రత్యేక పూజలు చేసుకుని భజన కార్యక్రమానికి ముగింపు పలికారు. కర్నూలు, కర్ణాటకకు చెందిన ఆరు బృందాల కళాకారులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కుడా ప్రతినిధి కారుణ్యలత

ఆత్మకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మున్సిపల్ సిబ్బందితో పాటు పలు పంచాయతీల కార్యదర్శులకు భవనాల క్రమబద్ధీకరణ పథకం గురించి కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రతినిధి కారుణ్యలత అవగాహన కల్పించారు. క్రమబద్ధీకరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధం

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. నంద్యాల పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను కమిషనర్ బండి శేషన్న, త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఫిజిక్స్ అధ్యాపకుడు బాలచంద్రుడు, కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాల్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి జనజీవన స్రవంతిలో కలిసే విధంగా చొరవ చూపాలన్నారు.

ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు


రామచంద్రారెడ్డి

గడివేముల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ డీఈ రవికుమార్ ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని 13వ నీటి సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తెలియకుండా నీటి సంఘం మాజీ అధ్యక్షుడికి చెక్కు మంజూరు చేయడంపై వివాదం చెలరేగింది. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో 13వ నీటి సంఘం పరిధిలో నీరు-చెట్టు పనులు జరిగాయన్నారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడితో కలిసి పనులు చేశామన్నారు. నీటి సంఘం ఎన్నికల అనంతరం అధ్యక్షుడు, కేసీ కెనాల్ అధికారితో సంయుక్తంగా జాయింట్ అకౌంట్ ఓపెన్ చేశామన్నారు. నీరు-చెట్టు పనులకు సంబంధించిన బిల్లులు రూ.9,42,787 మంజూరుకాగా డీఈ రవికుమార్ తనకు సమాచారం ఇవ్వకుండానే మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణారెడ్డికి చెక్కు మంజూరు చేశారన్నారు. జాయింట్ అకౌంట్‌లో నిధులు డ్రా చేసుకోవడానికి అధ్యక్షుడికి తెలియకుండా డీఈ బ్యాంకు అధికారులకు సిఫారసు లేఖ రాయడం సరికాదన్నారు. చెక్కు మంజూరుపై వివరణ అడుగగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డీఈపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

సిబ్బంది పని తీరు మెరుగుపర్చుకోవాలి

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీవో కార్యాలయ సిబ్బంది వారి పని తీరు మెరుగుపర్చుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా రవాణా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీటీవో మాట్లాడుతూ .. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

శాంతిరాంలో ఘనంగా ఫార్మా ఎక్స్‌పో

పాణ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫార్మా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఫార్మ ఎక్స్‌పో నిర్వహించారు. ఎక్స్‌పోను కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. స్టాల్స్‌ను వీక్షించడానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌చెట్టి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల ఖాతాల్లోకి ఆర్టీసీ అమౌంట్

● ఆడిట్‌కు ఉన్నతాధికారుల ఆదేశం

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్టీసీ డిపోలో కొంతఉన్నతాధికారుల ఖాతాల్లో ఆర్టీసీ అమౌంట్ జమ చేశారు. అధికారులు సైతం పట్టించుకోకుండా సైలెంట్‌గా ఉన్నారు. ఉద్యోగుల్లో ఒకరు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆడిట్‌కు ఆదేశించినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కకుండా ఉన్నతాధికారులు హుకుం జారీ చేసినట్లు విమర్శలున్నాయి. ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా ఆడిట్ చేయాలన్నది వాస్తవమే. కానీ డబ్బుల విషయం తెలియదని చెప్పడం గమనార్హం.

ఆర్టీసీ అధికారుల పేరుతో వసూలు

మన ఊరికి బస్సు వేసేందుకు నంద్యాల ఆర్టీసీ అధికారులకు డబ్బులు ఇవ్వాలని చెప్పి బండి ఆత్మకూరు మండలంలోని ఒక గ్రామంలో ఒక పెద్ద మనిషి డబ్బులు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీశైలం నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బండిఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయితే, సదరు అధికారులు పట్టించుకోలేదు. దాంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఊరికి బస్సు వేయించారు. గ్రామానికి బస్సు వచ్చిన తరువాత ఆ ఊరి ఒక పెద్ద మనిషి మన ఊరికి బస్సు వేశారు.. ఆర్టీసీ అధికారులకు డబ్బులు ఇవ్వాలని ప్రజల వద్ద నుంచి రూ. లక్ష వరకు వసూలు చేశారు. విషయం ఆర్టీసీ అధికారులకు తెలియడంతో ఆ పెద్ద మనిషి నుంచి డబ్బులు వెనక్కి ఇప్పించినట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం

● మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి ఫరూక్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసఫ్ పాఠశాల ఆవరణలో రీజినల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో గెలుపొందాలన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మంత్రి ఫరూక్‌ను ఘనంగా సన్మానించారు. రెండ్రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో రీజినల్ సుపీరియర్ సిస్టర్ జాక్యలిన్, కరస్పాండెంట్ సిస్టర్ అనిజెసింతా, ఆర్సీఎం ఫాదర్ కేడీ జోసఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు క్రీడలు, నృత్య పోటీలు నిర్వహించనున్నారు.

నూనెపల్లెను అభివృద్ధి చేయాలి

నంద్యాల రూరల్: నూనెపల్లెను అభివృద్ధి చేయాలని నూనెపల్లె అభివృద్ధి కార్యాచరణ కమిటీ సభ్యుడు న్యాయవాది శంకరయ్య కోరారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి త్వరగా నిర్మించాలన్నారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

తీర్థయాత్రల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా


ఓంకారేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే బుడ్డా దంపతులు

శ్రీశైలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులు తీర్థయాత్రల్లో ఉన్నారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారు, సోమనాథ్ ఆలయాలతో పాటు శుక్రవారం ఉదయం ఓంకారేశ్వర ఆలయ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమైనట్లు చెప్పారు.

వ్యర్థాలతో పర్యావరణానికి హాని

● దేవస్థానం ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు

శ్రీశైలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలానికి వచ్చే యాత్రికుల మిగులు వ్యర్థాలను అటవీ ప్రాంతంలో వేయడంతో పర్యావరణానికి హాని కలుగుతుందని అటవీశాఖ అధికారులు అన్నారు. శుక్రవారం మల్లమ్మ కన్నీరు ఆలయం నుంచి మిద్దెలగుడి వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డును ఆత్మకూరు ఎఫ్‌డీ విఘ్నేశ్వరప్ప పరిశీలించారు. అదే సమయంలో చెత్త వేసేందుకు వచ్చిన ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో వ్యర్థాల రీసైక్లింగ్ చర్యలు తీసుకుంటున్నామన్నారు. డంప్‌యార్డ్‌లో జంతువులు ప్రవేశించకుండా ఇనుప కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి


శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

కొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతాంగం ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్లు మంజునాథ్, నీలిమా సూచించారు. శుక్రవారం మండలంలోని గిరిజన రైతులకు మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం ఆధ్వర్యంలో నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం వారు ఉచితంగా శనగ విత్తనాలు పంపిణీ చేశారు. డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ ఎన్‌బీఈజీ-776 శనగ రకాన్ని ప్రథమ శ్రేణి ప్రదర్శన కోసం గిరిజన ఉప ప్రణాళిక కింద ఒక్కొక్క రైతుకు 40 కేజీల చొప్పున గువ్వలకుంట్ల, కొత్తపల్లి గూడేలకు చెందిన 20 మంది గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గిరిజన రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటిస్తూ ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, క్లస్టర్ కన్వీనర్ అమర్నాథ్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● సీఎంకు వినతిపత్రాన్ని సమర్పించిన ఎమ్మెల్యే జయసూర్య


సీఎం చంద్రబాబుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే గిత్త జయసూర్య కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కర్నూలు తర్వాత నందికొట్కూరు నియోజకవర్గంలో ఉల్లి సాగు అధికంగా రైతులు చేశారని ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేలు నంద్యాల జిల్లాకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నియోజకవర్గంలో అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగు చేశారని, ప్రస్తుతం ధరాఘాతం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దతు ధర రూ.2400 ఇచ్చి మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సీఎంను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వీడండి



బండిఆత్మకూరులో ర్యాలీలో పాల్గొన్న డీపీవో లలితాబాయి

బండిఆత్మకూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీపీవో లలితాబాయి హెచ్చరించారు. శుక్రవారం బండిఆత్మకూరులో పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో చెత్త తొలగింపును ఆమె పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ వ్యాధులు సోకకుండా ఉండాలంటే గ్రామాలు శుభ్రంగా ఉండాలన్నారు. ప్రజలను చెత్త వేయకుండా చైతన్యవంతులను చేయాలని సూచించారు. సచివాలయాలకు వేళకు విధులకు హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, కార్యదర్శులు అక్బర్, సుబ్బారావు, చౌడయ్య, శ్రీకాంత్, దివ్య పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని డీఎల్‌డీవో అన్వరాబేగం, ఎంపీడీవో మేరీ కోరారు. శుక్రవారం నందికుంట గ్రామంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు, టీడీపీ నాయకులు జహరుల్లా, సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేసి వీధుల్లో చెత్తను సేకరించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కార్యక్రమంలో మండలంలోని 44 మంది గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీలు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని టీడీపీ మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథరెడ్డి సూచించారు. శుక్రవారం అల్లూరు గ్రామంలో పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కారక్రమంలో సచివాలయం అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు

ఉపాధి అవకాశాలు కల్పించాలి


డెయిరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు వెలుగు అధికారులు, సీఆర్పీలు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇందిరేశ్వరంలో పీడీ పర్యటించారు. సీఆర్పీల పని తీరు ఆరా తీశారు. గ్రామంలోని పాల డెయిరీ పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం సీడ్ క్యాపిటల్ లోన్ తీసుకున్న సభ్యురాలు ఉమాదేవితో మాట్లాడి వారికి ప్రాజెక్ట్ తరపున ఉన్న అవకాశాల గురించి విపులంగా వివరించారు. గ్రామంలోని న్యూట్రిగార్డెన్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీపీఎం రంగారావు, ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, ఏపీఎం బాబురావు, ఎల్లయ్య, సీసీ వెంకటరమణ, వీవోఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోను కావొద్దు

బండిఆత్మకూరు నవంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి లోనుకావద్దని, దాని వల్ల బలహీనపడతారని డాక్టర్ శరశ్చంద్ర, సామాజిక కార్యకర్త వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో మానసిక బలహీనతలపై విద్యార్థులకు స్పెషల్ ఆఫీసర్ దాక్షాయిణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులు బలవర్ధకమైన ఆహార తీసుకోవాలని, ప్రశాంతంగా నిద్రించాలన్నారు. డాక్టర్ల సలహాలు తీసుకుంటే మానసిక బలహీనత నుంచి ఈజీగా బయటపడొచ్చన్నారు. ఇష్టంగా చదవాలని, ఒత్తిడి లోనుకావద్దన్నారు. తీసుకోద్దన్నారు. డీఎంహెచ్‌టీ బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

మహానంది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికై సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మళ్లీ టెట్ నిర్వహించడం సమంజసం కాదని, మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.మౌలాలి కోరారు. శుక్రవారం ఎం.తిమ్మాపురం, బొల్లవరం, మహానంది గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులతో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

వెలుగోడు, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో వెలుగోడులోని వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గోపూజ, కుంకుమార్చన, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు శాఖ నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, లాలం సుధాకర్, సంజీవరాయుడు, శ్రీనివాసులు, రామలింగేశ్వరరెడ్డి, తిరుపాలయ్య, మహిళా మండలి సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నంద్యాల గురురాజ పాఠశాల క్రీడాకారుడు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. అండర్-14విభాగంలో కె.మహిధర్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 22నుంచి 24వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ కోరారు. శుక్రవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభల లోగోను డాక్టర్ రామకృష్ణారెడ్డితోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. నాయక్ మాట్లాడుతూ డిసెంబరు 6న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివకుమార్, హర్షవర్ధన్, సాయి, సుధీర్, అనిల్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరికాదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలిపేయాలని శుక్రవారం పట్టణంలోని 17,18,19,20 వార్డుల్లో సంతకాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయాలనే కుట్రలో భాగంగానే మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ చేయాలని కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. నంద్యాల మెడికల్ కళాశాలలో చదివిన విద్యార్థికి స్టేట్ మొదటి ర్యాంక్ సాధించారన్నారు. మెడికల్ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలలో కూటమి నేతలు కూడా పాల్గొని నేడు హోంశాఖ మంత్రి అనిత మెడికల్ కళాశాలలే లేవని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. బంగారం స్వాధీనం

వెలుగోడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీకి గురైన నగదు, బంగారు, సెల్‌ఫోనును 48 గంటల్లోనే పోలీసులు ఛేదించి నిందితున్ని అరెస్టు చేసి సొమ్ము రికవరీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఎస్ఐ సురేశ్‌ను అభినందించారు. శుక్రవారం ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. ఈ నెల 19న వెలుగోడులో కుప్పల రమణయ్య తన ఇంటిలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేశారు. గ్రామ శివార్లలో అనుమానస్పదంగా ఉన్న కుప్పల రెడ్డయ్యను అదుపులోకి తీసుకొని విచారించి చోరీకి గురైన సొమ్మును రికవరీ చేశారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నంద్యాల టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గతంలో పని చేసిన సీఐపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఫిర్యాదుల ఆధారిటికి వైసీపీ కార్యకర్త గన్నీ కరీం ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన వ్యక్తిని కావడంతోనే తనపై సదరు సీఐ కేసులు నమోదు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. సీఐని వివరణ కోరగా చట్ట పరిధిలోనే పని చేసినట్లు తెలిపారు.

మొక్కజొన్న రైతులు కుదేలు

● ముంచిన 'మొంథా'

● ప్రభుత్వ మద్దతు ధర కోసం ఎదురు చూపులు

కొత్తపల్లి/ పాములపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించిన మొక్కజొన్న రైతులు దళారుల రాజ్యంలో బెంబేలెత్తుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వం గత పదిహేను రోజుల నుంచి మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని.. రైతులూ అధైర్యపడవద్దని చెబుతున్నా కానీ.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని దాచుకోలేక దళారులకు అతితక్కువ ధరకు అమ్ముకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కొత్తపల్లి మండలంలో రైతులు 20వేల ఎకరాలకుపైగా, పాములపాడు మండలంలో ఏడువేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మొంథా తుఫాన్‌తో చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతన్న ఆశలు అడియాశలయ్యా యి. ప్రభుత్వం క్వింటం రూ.2,400 మద్దతు ధర ప్రకటించడంతో రైతులు సంతోషించినప్పటికీ నేటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. దళారులు మొదట క్వింటా మొక్కజొన్నను రూ. 2100 కొనుగోలు చేశారు. తర్వాత ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ. 1500 నుంచి రూ.1700 ప్రకారం ధర నిర్ణయిస్తూ రైతుల శ్రమను నిలువున దోచేస్తున్నారు. దళారుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేస్తే తప్ప గట్టెక్కె పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పాములపాడులో మొక్కజొన్నను ఆరబోస్తున్న రైతులు


కొత్తపల్లి: మొక్కజొన్న ధాన్యాన్ని సంచులకు నింపుతున్న రైతులు

మద్దతు ధర ఇవ్వాలి



పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో చేతికొచ్చిన మొక్కజొన్న పంట దెబ్బతినింది. దళారులు రైతుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఇష్టాను సారంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

● హుసేన్ రెడ్డి, లింగాపురం

రైతుల కష్టాలు గుర్తించాలి



తొమ్మిది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చినప్పటికీ తుఫాన్ ప్రభావంతో గింజ మొలకెత్తడంతో తీవ్రంగా నష్టపోయా. ప్రభుత్వం చెప్పిన విధంగానే మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తే తప్ప.. నష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి లేదు.

● బొల్లు శ్రీనివాసులు, రైతు, పెద్ద గుమ్మడాపురం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఈ ఏడాది 25ఎకరాల్లో మొక్కజొన్నసాగు చేశాను. దాదాపు రూ. ఏడులక్షలు అయ్యింది. తుఫాన్ల కారణంగా తీవ్ర నష్టపోయాం. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర ఇవ్వాలి.

● సాయిక్రిష్ణ, రైతు, పాములపాడు

డోన్
డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి
మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించిన ఎమ్మెల్యే అఖిలప్రియ


నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల విజయ డెయిరీలో చైర్మన్, డైరెక్టర్లు చేస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలు కోరారు. శుక్రవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. విజయ పాల ప్యాకెట్ల ద్వారా ప్రజలపై భారాన్ని మోపి ఏడాదికి రూ.7కోట్లు సంపాదిస్తున్నారని తెలిపారు. ఇటీవల విజయ డెయిరీ స్థాపించిన నందమూరి తారక రామారావు శిలాఫలకాన్ని కాల్వలో పడేస్తే తాము తిరిగి శిలాఫలకాన్ని పెట్టించామని చెప్పారు. డెయిరీకి చెందిన 35 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. అలాగే ఆళ్లగడ్డలోని శిల్పులు తయారు చేసిన శిల్పాలను ప్రమోట్ చేసేందుకు ప్లానింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

నష్టాల ఉల్లి


ఆవులపల్లెలో ఉల్లిపంటను దున్నేస్తున్న రైతు

ఈ ఏడు ఉల్లి పంట రైతులను నష్టాల బాట పట్టించింది. ఉల్లికి ధర లేకపోవడంతో రైతులు పంటలను దున్నేస్తున్నారు. శుక్రవారం చాగలమర్రి మండలం ఆవులపల్లె గ్రామంలో సాంబశివుడు 3 ఎకరాలు, శివయ్య 3 ఎకరాలు, వెంకటనారాయణ 4 ఎకరాలు ఉల్లి పంటను దున్నేశారు. అలాగే ఉల్లిపంటను గొర్రెలకు వదిలేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

ఘనంగా పోలి పాడ్యమి వేడుకలు


చెరువులో కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు

డోన్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో శుక్రవారం పోలి పాడ్యమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. చెరువులో కార్తీక దీపాలు వెలిగించి నీటిలో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే చెరువులకు మహిళలు, భక్తులు సామూహికంగా జలహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న డోన్ సాంబశివాలయం ప్రధాన అర్చకులు, పురోహితులు కల్లె శేషావలి శర్మ మాట్లాడుతూ కార్తీకమాసం శివకేశవులకు ప్రీతికరమైన మాసం అని అన్నారు.

మొక్కల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలి


విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఎంఈవో

కొలిమిగుండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొక్కల పెంపకంపై ఆసక్తిని పెంచుకోవాలని కొలిమిగుండ్ల ఎంఈవో అబ్దుల్ కలాం సూచించారు. శుక్రవారం మండలంలోని బెలుం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరుడు, పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

కొలిమిగుండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్ర మౌళి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు పారిశుధ్య పనులను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రాఘవ రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఉదయ్, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎంఈవో అబ్దుల్ కలాంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు ఎస్సీజీ ఉన్నత పాఠశాల, చాగలమర్రిలోని ఆర్సీఎం, రామచంద్ర ఎయిడెడ్ పాఠశాలలను ఆళ్లగడ్డకు చెందిన ఎంఈవో శోభ వివేకవతి, హెచ్ఎంలు మహబూబ్‌బాషా, సుధాకర్‌గుప్త, త్రిమ్యాన్ కమిటీ అధికారులు కలిసి శుక్రవారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

శివపార్వతులకు పాన్పు సేవ

చాగలమర్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో కార్తీకమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో పార్వతి పరమేశ్వరులకు పాన్పుసేవ నిర్వహించారు. వివిధ రంగుల పూలతో అలంకరించిన ఉయ్యాల తొట్టిలో శివపార్వతులను కొలువుదీర్చి పాన్పుసేవ నిర్వహించారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

రుద్రవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అర్చకులు పూజలు చేశారు. అమ్మవారికి నూతన చీర, పూలమాలలతో అలంకరించారు. తరలివచ్చిన ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం
ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎమ్మెల్యే కోట్ల స్వీకరించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చ స్వామని, నంద్యాల జిల్లాలో ఉన్న డోన్‌ను కర్నూలు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని అన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోండి: మండలంలోని వలసల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సుదర్శన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు సుధాకర్ మరికొందరు ఎమ్మెల్యే కోట్లకు అర్జీ సమర్పించారు.

నాణ్యమైన భోజనం అందించాలి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కోట్ల ఆదేశించారు. శుక్రవారం కాలనీలో నెహ్రూనగర్ కాలనీలో పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనం చూసి ఎమ్మెల్యే కోట్ల రుచి చూశారు.

ఎమ్మెల్యేకు సన్మానం: ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే కోట్లను శుక్రవారం ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఏతా నాగరాజుగౌడులు కలిసి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ ఇంతియాజ్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్ రెడ్డి, పీఆర్ డీఈ గంగాధర్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ నారాయణ, టీడీపీ నాయకులు వలసల రామకృష్ణ, దొరదరామిరెడ్డి, టీఈ రామచంద్రగౌడు, శేషిరెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. డోన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. మైనింగ్‌లో వడ్డెరులకు రిజర్వేషన్లు కల్పించాలని సంఘం అధ్యక్షుడు వడ్డె నాగరాజు కోరారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి

కోవెలకుంట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 21 వరకు నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారంతో ముగిసినట్లు గ్రంథాలయాధికారి బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సుధీర్ కుమార్, తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. గిద్దలూరు గంథాలయాధికారి మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజామల: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ నెల 14 నుంచి 19 వరకు గంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపురోజు సందర్భంగా గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో నిర్వాహకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో స్థానిక హెచ్ఎం పీసీ మద్దిలేటి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఇబ్రహీం, శివమ్మ, షల్లమ్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ రైల్వేగేట్స్ సమీపంలో శ్రీనివాసనగర్ చెందిన బి.మోహన్ అనే వ్యక్తి చెందిన సెల్ ఫోన్ అపహరణకు గురైంది. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో స్పందించిన పోలీసులు డీఎస్పీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సీసీ కెమెరాలను పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులను పోలీ సులు గుర్తించి విచారించి సెల్ ఫోన్ ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. గురువారం డీఎస్పీ శ్రీనివాసులు చేతుల మీదుగా బాధితుడు బి.మోహ న్‌కు సెల్‌ఫోన్ అందించడంతో డీఎస్పీ, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పీడీ ప్రతిభ


పీడీ బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంజామల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ బాషా ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ హుసేన్ గురువారం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి బాషాను అభినందించారు. ఈ నెల 19న గుంటూరు నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్‌లో ఎంపికైన బాషా షాట్‌పుట్ త్రో, డిస్క్ త్రో పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. డిసెంబరు 13 నుంచి 15 వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో బాషా పాల్గొంటారని తెలిపారు.

చౌడేశ్వరీమాత పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు, ఆలయ సిబ్బంది

బనగానపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ పీపీ.కుమార్‌రెడ్డి పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. పల్లకీసేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అండర్ - 17 విభాగంలో విద్యార్థి అభిషేక్ సాఫ్ట్‌బాల్, నందిని బేస్‌బాల్, అండర్ - 14 విభాగంలో అర్జున, బేస్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీజికల్ డైరెక్టర్లను ఉపాధ్యాయులు అభినందించారు.

బీపీఎస్ స్కీం అమలు

డోన్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని భవనాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్.నెం. 225ను ఈ నెల 12న జారీ చేసింది. ఈ పథకం ప్రకారం మున్సిపల్ శాఖ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను బీపీఎస్ (బిల్డింగ్ పెనాలైజేషన్ స్కీం) కింద చట్టబద్ధం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ బీపీఎస్ పథకం 01.01.1985 నుంచి 31.08.2025 మధ్య కాలంలో నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు ఈ పథకానికి అర్హులు. డోన్ పట్టణ ప్రజలు తమ నిర్మాణాలను బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చని, ఈ అవకాశం వచ్చే ఏడాది 12-3-2026 వరకు మాత్రమే అందు బాటులో ఉంటుందని తెలిపారు.

అయ్యప్ప స్వామికి విళక్కి పూజ

కోవెలకుంట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం గురుస్వామి మురళీకృష్ణ ఆధ్వర్యంలో విళక్కి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండదీప స్థాపన, నవగ్రహ మండ పారాధన, గణపతి హోమం నిర్వహించారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

డోన్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వార్డెన్ మధు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం కావడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన దుప్పట్లను విద్యార్థులకు అందజేశామని ఆయన తెలిపారు.

చాగలమర్రిలో మోస్తరు వర్షం
తడిచిన మొక్కజొన్న ● ఆందోళనలో రైతులు


చాగలమర్రి సర్వీసు రహదారిలో తడిచిన మొక్కజొన్న ధాన్యం

చాగలమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో శుక్రవారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో రహదారులపై ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముత్యాలపాడు, గొడిగనూరు, పెద్దబోదనం, చాగలమర్రి రహదారుల్లో పంట పొలాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచి రైతులకు నష్టం కలిగించింది. మొక్కజొన్న ధాన్యానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

బనగానపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాత్రి బనగానపల్లె పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా మహిళలపై జరిగే అఘాయిత్యాలు, బాలిక సంరక్షణ, పోక్సో చట్టం, సైబర్ క్రైం, రహదారి భద్రతా నియమాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులనుంచి వచ్చే లింకులపై క్లిక్ చేసేటపుడు, డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ఏదైనా ప్రమాదాలు రహదారిపై జరిగితే 100, 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐలు దుగ్గిరెడ్డి, కల్పన, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

● సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం నందివర్గంలోని విజయనికేతన్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

మైనింగ్ లీజులు అమలు చేయాలి

బేతంచెర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంఘం సొసైటీలకు మైనింగ్ లీజులు అమలు చేయాలని వడ్డెర సం మం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కార్యాలయంలో వడ్డెర సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శిల్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ వడ్డెర సంఘం సొసైటీ ఏర్పడి ఇప్పటికి దాదాపు 70 సంవత్సరాలు అవుతుందన్నారు. అయితే వడ్డెర సంఘం సొసైటీలకు కాంట్రాక్టు పనులు మైనింగ్ లీజుల రిజర్వేషన్లు అప్పట్లో 25 శాతం కల్పించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వడ్డెర సంఘం సొసైటీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం వడ్డెరలకు రెండు పార్లమెంటు సీట్లు, 10 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, దేవేంద్ర, డి.మురళి, వెంకట్రాముడు, లాలెప్ప, చెల్లా అలి, అలకుంట్ల మధు, బలరాముడు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

ఆళ్లగడ్డ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి సర్వేను ఎంపీడీవో నూర్జహాన్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పలు వీధులలో కుష్ఠు వ్యాధి నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో కుష్ఠువ్యాధి లక్షణాలపై ముత్యాలపాడు వైద్యులు తస్లీన్ సుల్తానా, ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి అనుమానిత కేసులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది నూర్జహాన్, రాముడు, ప్రవల్లిక, రజని పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ సోహెల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టపల్లె, కాపులపల్లె గ్రామాల్లో 104 సంచార చికిత్సలో భాగంగా గ్రామాల్లోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్ఎం జయ లక్ష్మీ, ఆశా కార్యకర్త సుమలత పాల్గొన్నారు.

ఉపాధి పనులపై తనిఖీలు

అవుకు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులపై డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ (డీఆర్పీ)లు తనిఖీలు చేపట్టినట్లు ఎంపీడీవో రామకృష్ణవేణి శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి డిసెంబరు 26 వరకు ఉపాధి పనులపై డీఆర్పీలు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేస్తారన్నారు. మండలంలో 2024 ఏప్రిల్ నెల నుంచి 2025 మార్చి వరకు ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో రూ. 10కోట్ల వ్యయంతో 1200 పనులను చేపట్టారన్నారు. వీటిపై తనిఖీలు చేపట్టి డిసెంబరు నెల ఆఖరిలో సామాజిక బహిరంగ సభను నిర్వహిస్తారని తెలిపారు.

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి

శిరివెళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్లలోని మహదేవపురం గుడి సమీపంలో అన్వర్‌బాషాకు చెందిన పొట్టేళ్లపై కుక్కలు దాడి చేశాయి. గురువారం రాత్రి షెడ్డులో ఉన్న పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో 6 పొట్టేళ్లు మృతి చెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితుడు అన్వర్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పశువైద్యాధికారి దస్తగిరి ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన పొట్టేళ్లకు చికిత్స నిర్వహించారు.

పశుగ్రాసానికి భలే డిమాండ్


ట్రాక్టర్లలో తరలిస్తున్న పశుగ్రాసం

రుద్రవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగ్రాసానికి భలే డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్ వడ్లకేళ్లు పశుగ్రాసం రూ.10వేల నుంచి రూ.12వేల రేటు పలుకు తోంది. రుద్రవరం మండలం నుంచి ప్రకాశం, కడప జిల్లా లకు ట్రాక్టర్లలో పశుగ్రాసం తరలిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసం కోసం రైతులు రావడంతో డిమాండ్ ఏర్పడింది.

స్వచ్ఛత అందరి బాధ్యత: ఎంపీడీవో

డోర్నిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో డీమ్-5లో భాగంగా పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సావిత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, రోడ్లపై చెత్తా చెదారం వేయకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ మధుశేఖర్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రుద్రవరం: గ్రామ పంచాయతీల్లో ప్రజల సహకారంతోనే స్వచ్ఛత సక్రమంగా ఉంటుందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో సర్పంచ్ సుబ్బమ్మ అధ్యక్షతన పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛతపై శిక్షణ నిర్వహించారు. కార్యదర్శి పాములేటి, టీడీపీ నాయకుడు నంద్యాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంజామల: పర్యావరణపోటు పరిరక్షణకు అందరూ కృషిచేయాలని ఎంపీడీవో సాల్మన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముక్కమల్ల గ్రామంలో పారిశుధ్య నివారణ పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని పారిశుధ్య కార్మికులకు పచ్చదనం - పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో రామకృష్ణవేణి శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు రామవరం గ్రామానికి తీసుకెళ్లి ఇంటింటికి చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరు చేయడం, షెడ్డుకు తరలించడం, కంపోస్టు ఎరువుల తయారీపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చాగలమర్రి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీవో తాహిరాహుసేన్, టీడీపీ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి సంపద కేంద్రం పరిసరాలను శుభ్రపరిచి మొక్కలు నాటారు. రహదారులకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కొండా రెడ్డి, ఈవో తారకేశ్వరి, కార్యదర్శులు ఆదినారాయణ, నాగార్జున, ఎంపీటీ రామకుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



డబ్ల్యూ గోవిందిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది


మెట్టుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పారిశుధ్య కార్మికులు